


సేనాధిపతి విష్వక్సేనుడి వాహనం వద్ద జీయంగార్లు, తితిదే ఈవో జె.శ్యామల రావు దంపతులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి దంపతులు, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, రామకృష్ణదీక్షితులు, కంకణ భట్టాచార్యులు గోవిందాచార్యులు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాలకు తితిదే గురువారం అంకురార్పణ చేసింది. వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా అంకురార్పణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను శ్రీవారి సేనాపతి శ్రీవిష్వక్సేనుడు సమీక్షించారు. శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలను ధరించి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాల భేరీ నినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో ఊరేగి పర్యవేక్షించారు. తిరుమల మొత్తం రాత్రివేళల్లో దేదీప్యమానంగా దేవతా ప్రతిమలతో వెలుగులీనుతూ భక్తులను అలరిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫాగ్ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. ఈ ప్రదేశంలో ప్రత్యేకమైన స్క్రీన్ వెనుక దేవతామూర్తుల విగ్రహాలు వస్తుంటాయి. ఆ ప్రదేశంలో భక్తులు తమ ఫోన్‌లో ఫొటోలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. కార్పెట్ స్క్రీన్‌ను మొదటిసారిగా ఏర్పాటుచేశారు.



తిరుచ్చిపై శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు

మలయప్పస్వామి దర్శనం..
యజ్ఞయాగాదుల పుణ్యం



ఈనాడు-తిరుపతి; న్యూస్‌టుడే, తిరుమల: శ్రీవారిని దర్శించుకున్న వారికి యజ్ఞయాగాదులు చేసిన పుణ్యం కలుగుతుందని శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారని, వాటి విశిష్టతను వివరించారు.

- వైకుంఠంలో తల్పమైన శేషుడిపై స్వామి అనుగ్రహంతో మొదటి రోజు పెద్ద శేషవాహనంగా మాడవీధుల్లో శ్రీమలయప్పస్వామి విహరిస్తారు.
- వాసుకీని అనుగ్రహిస్తూ చిన్నశేష వాహనంపై స్వామి భక్తులను కటాక్షిస్తారు.
- పౌరుషానికి ప్రతీకైన సింహాన్ని వాహనంగా మలుచుకున్నారు.
- పాలను, నీళ్లను వేరు చేసే శక్తి హంసకు ఉంది. మనలోని చెడు ఆలోచనలను వేరుచేసి స్వామి అనుగ్రహం పొందడానికి హంస వాహనాన్ని అధిరోహిస్తారు.
- రామావతారంలో ఎనలేని సేవ చేసిన హనుమంతుని వాహనంగా శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆరో రోజున భక్తులను అనుగ్రహిస్తారు.
- స్వామివారికి సూర్య చంద్రులు నేత్రాలుగా ఉంటారు. ఈ సృష్టికి మూలం సూర్యుడు, చంద్రుడు. అలాంటి వారే స్వామికి సేవకులుగా ఉన్నారంటే శ్రీమహావిష్ణువు ఎంత శక్తిమంతులో అర్థమవుతోంది.
- మహారథోత్సవంలో స్వామిని దర్శించుకున్న వారికి పునర్జన్మ ఉండదని శాస్త్రాలు చెబుతున్నాయి.
- కలియుగాంతంలో ప్రజలను రక్షించనున్న కల్కిగా చివరి రోజున అశ్వ వాహనంపై శ్రీమలయప్పస్వామి కరుణిస్తారు.



గరుడసేవ ప్రత్యేకం.. గరుత్మంతుడు స్వామివారిని నిత్యం కొలుస్తారు. ఎక్కడికైనా ఆఘమేఘాలపై చేరుస్తారు. అలాంటి గరుత్మంతుడిని తన వాహనంగా ఉపయోగించుకున్నారు. ప్రతి వైష్ణవ ఆలయంలోనూ స్వామికి ఎదురుగా గరుత్మంతుడు ఉంటారు. ఏడాదిలో గరుడ సేవ రోజు మాత్రమే మూలవిరాట్టుకు ఉన్న ఆభరణాలను బయటకు తెచ్చి అలంకరిస్తారు.

స్నపన తిరుమంజనం: సంప్రదాయం ప్రకారం మూడు రోజులపాటు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. స్వామివారిని ఉపచారాల తర్వాత మాలలతో అలంకరిస్తారు. చివరిగా శ్రీభూవరాహస్వామి ముఖ మండపం వద్ద చక్రస్నాన మహోత్సవంలో భాగంగా ఉభయదేవేరులతో శ్రీవారికి, చక్రత్తాళ్వారులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.



తెలుసుకోండి..
బ్రహ్మోత్సవాలు కనరండి

అదనంగా సమాచార కేంద్రాలు ఏర్పాటు చేసిన తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. శ్రీవారి దర్శనం, వసతి, అన్నప్రసాదం, లడ్డూ కౌంటర్లు, వాహన సేవలు, స్థానిక ఆలయాలు, రవాణా వసతులపై సమాచారం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో తితిదే ఆధ్వర్యంలో ఐదు సమాచార కేంద్రాలు, అదనంగా మరో ఏడు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారు. తిరుమలలోని జీఎన్‌సీ, సీఆర్వో, ప్రధాన కల్యాణకట్ట, భజనమందిరం, ఏటీసీ సమాచార కేంద్రాలతోపాటు అదనంగా పీఏసీ2, వీజీవో కార్యాలయ సమీపంలో, రాంభగీచా అతిథిగృహం, మ్యూజియం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా తితిదేకు సంబంధించిన సమాచారాన్ని కరపత్రాల్లో ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార కేంద్ర సిబ్బంది భక్తులు మాట్లాడే భాషలోనే వారికి సమాచారం అందిస్తారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షించనున్నారు.

చిన్నారులు, వృద్ధులకు జియో ట్యాగింగ్

తితిదే భద్రతా, నిఘా విభాగం నుంచి 1,250 మంది, పోలీసు శాఖ నుంచి 3,900 మంది సిబ్బందిని నియమించారు. గరుడ సేవకు అదనంగా 1,200 మందితో భద్రత కల్పించనున్నారు. వృద్ధులు, చిన్నారులు తప్పిపోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జియోట్యాగింగ్ చేయనున్నారు. ఎవరైనా తప్పిపోయినా సకాలంలో గుర్తించే అవకాశం ఉంటుంది.

ప్రత్యేకంగా కాల్ సెంటర్

సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది భక్తుల నుంచి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారు. భక్తులు భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొన్నప్పుడు టోల్ ఫ్రీ నంబరు 155257కు ఫిర్యాదు చేయవచ్చు. బ్రహ్మోత్సవాల సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. తమ సూచనలు, సలహాలను తితిదే మెయిల్ helpdesk.ttd@tirumala.orgకు పంపవచ్చు.

ట్రాఫిక్ నిబంధనలు


ట్యాక్సీలు, వాహనదారులను ఈ నెల 4 నుంచి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు, 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో జీఎన్‌సీ సర్కిల్ నుంచి తిరువెంకటపతం ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా పీఏసీ-111 కూడలిలో యాత్రికులను దించి తిరుపతి వెళ్లాలి. తిరుమల లోపలకు అనుమతించరు. 8న గరుడసేవ దృష్ట్యా 7వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 9వ తేదీ ఉదయం 9 గంటల వరకు తిరుమలకు ట్యాక్సీలు అనుమతించరు.

మెరుగైన వసతులు

అన్ని విభాగాల్లోనూ సేవల సంఖ్య పెంపు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తితిదే ఉన్నతాధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. 2023లో అధికమాసం కారణంగా సెప్టెంబర్, అక్టోబర్‌లో సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో గత బ్రహ్మోత్సవాలకు మిన్నగా భక్తుల కోసం తితిదే మెరుగైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. గత సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు కలిపి దాదాపు 11 లక్షలమంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.47.55 కోట్లు లభించాయి. లడ్డూలు 57,63,360 విక్రయించారు.









అడ్డంకులు తొలగించి..: తిరుమలలో ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలను తిరుమల ట్రాఫిక్ పోలీసులు సురక్షితమైన ప్రాంతానికి తరలించారు. వీటిని బాంబ్ స్క్వాడ్ టీమ్‌లతో చెక్ చేయించారు.

	లడ్డూ కౌంటర్లు	శ్రీవారి సేవకులు	ఎల్‌ఈడీ తెరలు	సాంస్కృతిక బృందాలు	పారిశుద్ధ్య సిబ్బంది	పర్యవేక్షకులు	అన్నప్రసాదాలు	పులిహోర	పాలు	గ్యాలరీల్లో మరుగుదొడ్లు
గతేడాది	54	3000	మూడు రోజులు	12 రాష్ట్రాలు	267	8 మంది	8.43 లక్షల మందికి	1.75 లక్షల మందికి	లక్ష మందికి	11
ప్రస్తుతం	65	4000	9 రోజులు	21 రాష్ట్రాలు	600	49 మంది	11.43 లక్షలమందికి	2 లక్షల మందికి	1.9 లక్షల మందికి	98

వారాహి సభలో.. ధర్మాగ్రహం

వైకాపా నేతలపై విరుచుకుపడిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారాహి బహిరంగ సభ విజయవంతంగా ముగిసింది. స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పులే కూడలిలో తన వారాహి డిక్లరేషన్ ప్రకటించారు. ఈ సమయంలో పవన్ కల్యాణ్ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. నిర్దేశిత సమయం కన్నా కాస్త ఆలస్యంగా సాయంత్రం 6.04 గంటలకు ఆయన ప్రసంగం మొదలైంది. 7.24 నిమిషాలకు ముగించారు. మొత్తం 1.20 గంటలపాటు ప్రసంగం సాగింది. గుక్క తిప్పుకోకుండా సనాతన ధర్మం, వారాహి డిక్లరేషన్‌పై ఆంగ్లం, తమిళం, తెలుగులో మాట్లాడుతూనే మరో వైపు వైకాపా నేతలపై విరుచుకుపడ్డారు. తితిదే మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలపై విమర్శలు గుప్పించారు. వారి కారణంగానే నెయ్యిలో కల్తీ జరిగిందని మండిపడ్డారు. స్వామివారి నైవేద్యాల్లోనూ అపరాధం చేశారని దుయ్యబట్టారు. ధర్మారెడ్డి ఎక్కడ అంటూ గట్టిగా నిలదీశారు. ఆయన్ను వెతికి పట్టుకువస్తే మరిన్ని నిజాలు బయటకు వస్తాయన్నారు. పవన్ ప్రసంగిస్తున్నంతసేపు సభకు విచ్చేసిన యువత, మహిళల నుంచి మంచి స్పందన కనిపించింది. సభ చివరలో అందరితో సనాతన ధర్మం ప్రతిజ్ఞ చేయించారు. సభలోని యువత జాతీయ జెండాలు, జనసేన జెండాలు చేతబూని ఉత్సాహంగా కనిపించారు. కొందరు యువకులు చేతిలో కర్పూరాలు వెలిగించి తమ అభిమాన నాయకుడికి హారతులు సమర్పించారు. ఈ సభలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, ఎమ్మెల్సీ హరి ప్రసాద్, భాజపా అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, తెదేపా నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, సుభాషిణి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పవన్‌కల్యాణ్‌కు రాజదండం బహూకరిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరునగరిలో జనసందడి

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరునగరి జనసైనికుల కేరింతలు, ఆనందోత్సాహంతో నిండింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పవన్‌కల్యాణ్ తొలిసారి తిరుపతిలో సభ నిర్వహించడంతో భారీ సంఖ్యలో హాజరయ్యారు. కొంతమంది 'సీఎం, సీఎం' అని కేకలు వేయడంతో, వాళ్లను అలాంటి నినాదాలు చేయొద్దని పవన్‌కల్యాణ్ సున్నితంగా వారించారు. బాలాజీ కాలనీతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని.. చిన్నపుడు యోగా నేర్చుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. మైకుల్లో ఆయనకు అత్యంత ఇష్టమైన 'ఓం నమో నారాయణ' మంత్రం ధ్వనిస్తుండగా ఆయన వారాహి వాహనంపై ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకున్నారు. ప్రసంగం మధ్యలో 'పవన్ కల్యాణ్ జిందాబాద్' అంటే, ఆ మాట వద్దంటూ అందరూ నారాయణ మంత్రాన్ని జపించాలని సూచించారు.


సభలో సెల్ఫీలు తీసుకుంటున్న అభిమానులు

కందిపప్పు పంపిణీకి ఏర్పాట్లు

ఈనాడు డిజిటల్, తిరుపతి: పౌరసరఫరాల సంస్థ నుంచి ఎట్టకేలకు కందిపప్పు పూర్తిస్థాయిలో పంపిణీ కానుంది. వైకాపా పాలనలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకోగా కూటమి ప్రభుత్వం వందశాతం పంపిణీపై దృష్టి సారించింది. దసరాలోగా లబ్ధిదారులందరికీ చేరవేసే లక్ష్యంతో పనిచేస్తోంది. ఈనెల 7లోగా డీలర్లకు చేరవేసి 15వ తేదీవరకు రేషన్‌కార్డు కలిగిన అర్హులందరికీ బియ్యం, చక్కెర, రాగులతోపాటు కందిపప్పును అందించనున్నారు.

పెరిగిన ధరల నుంచి ఉపశమనం

గతంలో హాకా అనే సంస్థ కందిపప్పును సరఫరా చేయగా, ప్రస్తుతం కర్నూలుకు చెందిన వీకేర్ ఎంటర్‌ప్రైజెస్ సరఫరా చేయనుంది. జిల్లాకు 289 టన్నుల కందిపప్పు అవసరం కాగా ప్రస్తుతానికి 67 టన్నుల వరకు జిల్లాకు చేరుకుంది. అధిక ధరలతో ప్రజలపై నిత్యావసరాల ధరల భారం పడుతున్న నేపథ్యంలో రూ.67కు కిలో కందిపప్పును అందించడంతో వారికి కొంత ఉపశమనం కలగనుంది. జిల్లాలో 1,457 రేషన్ దుకాణాలు ఉండగా సుమారు 5.89 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

సర్వదర్శనానికి
15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 80,613 మంది దర్శించుకున్నారు. రూ.2.92 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

1,450 మందితో సీఎం పర్యటనకు భద్రత

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమల వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి 1,450 మంది పోలీసులతో పటిష్ఠ భద్రత కల్పిస్తున్నారు. విమానాశ్రయం నుంచి తిరుమల వరకు రోడ్డుకు ఇరువైపులా పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో బాంబ్, డాగ్, స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. రెండు రోజులుగా తిరుమల వరకు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు.

ముందుకు సాగని రైల్వే ప్రాజెక్టులు

◆ నేడు ఎంపీలతో ఎస్సీఆర్ జీఎం సమావేశం ◆ పట్టాలెక్కించాల్సినవి ఇవే

గూడూరు, న్యూస్‌టుడే: గత ఏడేళ్లలో పట్టాలెక్కని ప్రాజెక్టులకు ముందుకు తీసుకెళ్లడానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రాజెక్టులపై ఆ సంస్థ జనరల్ మేనేజర్ శుక్రవారం విజయవాడలో సమావేశం కానున్నారు. చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులపై ఎంపీల నుంచి ప్రతిపాదనలు తీసుకోనున్నారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పలు ప్రాజెక్టులు పనులపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

◆ తిరుపతి కేంద్రంగా నడిచే 130 రెగ్యులర్ రైళ్లు, 20 ప్రత్యేక రైళ్లను దేశ వ్యాప్తంగా అనుసంధానం చేయాలి. భారత్ గౌరవ్ రైళ్ల పెంపుతో దక్షిణ మధ్య రైల్వే 25 భారత్ గౌరవ్ సర్వీసులు నడుపుతోంది. వీటిని తిరుపతికి అనుసంధానం చేసేలా చూడాలి.



ప్రైవేట్ టెర్మినల్స్‌తో ఆర్థికాభివృద్ధి

జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రైవేటుగా సైడింగ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీని ద్వారా అధికంగా మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. పెద్దఎత్తున సరకు రవాణాకు ఇది దోహద పడతుంది. గూడ్స్ ట్రాఫిక్ కోసం కొత్త స్టేషన్లను నాయుడుపేట, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. సిలికా లోడింగ్‌కు చర్యలు చేపట్టాలి.

అనంతపురం నుంచి ఢిల్లీకి కిసాన్ రైలు ఏర్పాటు చేసినట్టు తిరుపతి నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి అనుసంధానం చేయాలి.

రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు

తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధికి 2022లో బీజం పడింది. దీనిని 33 నెలల్లో రూ.300 కోట్ల వ్యయం 2025 ఫిబ్రవరికి పూర్తి చేయాల్సి ఉంది. 1980లో రూ.53.85 కోట్లతో రేణిగుంటలో ఏర్పాటు చేసిన క్యారేజ్ రిపేర్ షాపు విస్తరించింది. తిరుచానూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పురోగతిలో ఉంది. లైన్ డబ్లింగ్, ట్రిప్లింగ్, కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. 130-140 వేగంతో ఉన్న ట్రాక్‌లు మరింత వేగం పెంచాల్సి ఉంది.

కొత్త లైన్లపై ఆశలు..

◆ గూడూరు-దుగరాజపట్నం రైల్వే లైన్ 42 కి.మీ కాగా రూ.760 కోట్ల అంచనా. దీనిని తిరిగి పట్టాలెక్కించాలి. ఇక్కడ పోర్టు ఏర్పాటు ద్వారా సరకు రవాణాకు లైన్ అవసరం.

◆ నడికుడి-శ్రీకాళహస్తి మార్గం ఐదు దశల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఇది తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, వెంకటగిరిలో కొంత ప్రాంతం ఉంది. దీనికి భూసేకరణ పెద్ద సమస్య కాగా రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం కాస్ట్ షేరింగ్‌లో భూమి అప్పగించాలి.

◆ గూడూరు-రేణిగుంట మూడో లైన్ ఏర్పాటుకు సుమారు 83.14 కి.మీ కోసం రూ.884 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం మార్గం డబ్లింగ్‌తో పాటు ప్రజా రవాణాకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలి.

◆ దుర్గవరం-పాకాల-కాట్పాడి మార్గం 290 కి.మీ డబ్లింగ్ కోసం రూ.290 కోట్ల అంచనా కాగా గత ఏడేళ్లలో పెద్దగా నిధులు ఇచ్చిన పాపాన పోలేదు. తాజాగా పాకాల రైల్వే స్టేషన్ రీడెవలప్‌మెంట్ కింద అభివృద్ధి చేపట్టడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

◆ గూడూరు ఆర్వోబీకి కదలిక తీసుకురావాల్సి ఉంది. ఎంపీలు ఈ విషయంలో చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో వెంకటగిరి రైల్వే స్టేషన్ వద్ద ఆర్వోబీ అవసరం. ప్రధాన పట్టణాల్లో అండర్ పాస్ వంతెనలు పూర్తి కావాల్సి ఉంది. సూళ్లూరుపేట పట్టణంలో ఐదేళ్లుగా పనులు ముందుకు కదల్లేదు.

రబీ సేద్యం.. విత్తనం సిద్ధం

ఏపీసీడ్స్‌లో వంగడాల విక్రయాలు



శేషమనాయుడు కండ్రిగ సమీపంలో దుక్కులు దున్నుతున్న రైతు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రబీ దృష్ట్యా అవసరమైన వరి విత్తన రకాలను అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) సన్నద్ధమైంది. ఈ మేరకు సాధారణ విత్తన విక్రయాలను ప్రారంభించింది. ఏటా రబీ సీజన్‌లో సాధారణ విక్రయాలతో పాటు బైబ్యాక్ పద్ధతిలో రైతులకు విత్తన రకాలు అందజేయడం, విత్తనోత్పత్తి ద్వారా నాణ్యమైన ధ్రువీకరణ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం ప్రధాన లక్ష్యంగా విత్తనాభివృద్ధి సంస్థ ముందుకు సాగుతోంది.



వరి వంగడాలను సంచులకు సిద్ధం చేస్తున్న హమాలీలు

జోరందుకున్న దుక్కులు..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ కంటే రబీలో వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఏటా అక్టోబరు మధ్య నుంచి డిసెంబరు వరకు వర్షాలు పడుతుంటాయి. ఈ కారణంగా బీళ్లుగా ఉన్న పొలాలను రైతులు సాగులోకి తీసుకువచ్చే సమయం ఇది. వర్షాలపై మిన్నంటిన ఆశలతో సాగు రైతులు అవసరమైన విత్తనాలను సంసిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఏపీసీడ్స్‌లో విత్తన విక్రయాలు జోరందుకున్నాయి. తెలుగుగంగ పరివాహక ప్రాంతంలో రైతులు పొలాలు దున్ని దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులందరికీ నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏపీసీడ్స్ సన్నద్ధమైంది.

సాధారణ రకాలకు సంబంధించి ఈ ఏడాది విత్తన ధరలు ఇలా..

వరి రకం	కిలోలు	ధర(రూ.)
బీపీటీ 5204	25	1045.00
ఆర్ఎన్ఆర్15048	25	1045.00
ఎన్ఎల్ఆర్ 33892	30	1134.00
ఎన్ఎల్ఆర్ 34449	30	1215.00
కేఎన్ఎం 1638	25	1012.50
ఎడీటీ 39	30	1014.00
ఎంటీయూ 1010	30	1110.00
జ్యోతి	30	1110.00
ఉమ	30	1110.00

విత్తనోత్పత్తి సన్నాహాలు..

రబీ సీజన్‌లో ఏపీసీడ్స్ విత్తనోత్పత్తి కింద వాటాదారులైన రైతులకు అవసరమైన వరి వంగడాలను బైబ్యాక్ పద్ధతిలో ఇచ్చేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. ఇక్కడి సంస్థలో వాటాదారులైన రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 15 నుంచి బీపీటీ-5204, ఎన్ఎల్ఆర్ 33892, కేఎన్ఎం1638, ఉమ, పౌర్ణమి, ఏడీటీ 37, ఏడీటీ 39, ఎంటీయూ 1010, ఎంటీయూ 1224, ఎన్ఎల్ఆర్ 3449, జ్యోతి రకాలను ఇస్తాం. నవంబరు 15 నుంచి ఆర్ఎన్ఆర్ రకాన్ని అందుబాటులో ఉంచుతాం.
– సంపత్‌కుమార్, ఏపీసీడ్స్ జిల్లా మేనేజరు

చిల్లకూరులో వైకాపా నేతదే హవా

◆ గ్రామంలో శాంతి భద్రతల సమస్య
◆ వడ్డిపాళెంకు నీటి సరఫరా బంద్

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చిల్లకూరులో శాంతి భద్రతల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇక్కడ వైకాపా కీలక నేత తీరుతో గ్రామంలో గొడవలు ప్రారంభమయ్యాయి. పంచాయతీ పెత్తనం చలాయిస్తున్న నేత అరాచకాలకు అడ్డు అదుపు లేదు. గత వైకాపా పాలనలో స్థానికులు నోరు మెదిపే పరిస్థితి లేదు. కూటమి అధికారంలోకి వచ్చినా ఆయన హవానే నడుస్తోంది.

❖ చిల్లకూరు చెరువును గతేడాది అనధికారికంగా వేలం నిర్వహించి సొమ్ములు తన చేతిలో ఉంచుకున్నారు. ఈ క్రమంలో పాటదారును బెదిరించి పోలీస్ కేసుల వరకు వ్యవహారం నడిచింది. దీంతో పాటదారు తెదేపాకు మద్దతుగా నిలిచారు. వైకాపా నేత పాటదారుని చెరువులోకి దిగేందుకు వీలు లేకుండా చేస్తున్నారు. రెండు రోజుల కిందట పాటదారు రమణయ్య చెరువు సమీపంలో చేపల వేటకు కోసం ఏర్పాట్లు చేసుకుంటుండగా ఆ నేత గ్రామస్థులను రెచ్చగొట్టి అక్కడికి పంపించారు. దీంతో రెండు వర్గాలు గొడవ పడ్డాయి.



తాగునీటి గొట్టపు పథకం బాగు చేయని వైనం

నీటి సరఫరా బంద్.. చెరువు వేలం పాటదారు మీదకు గొడవకు వెళ్లలేదన్న అక్కసుతో గ్రామస్థులకు తాగునీటి పథకం బాగు చేయలేదు. ఇక్కడికి వచ్చే నీటి పథకం ఆపేసి నీటి సరఫరా ఆపించారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజులుగా గొడవలు మొదలయ్యాయి. ఎన్నికల ముందు కూడా ఇదే తీరుగా బీసీ, ఓసీ కాలనీలకు నీటిని ఆపేసిన ఆయన తీరుతో స్థానికులు ఎన్నికల్లో మొట్టికాయలేశారు.

ఎస్సీ, ఎస్టీల కేసులు .. ఇక్కడ తన మాట వినని వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడానికి వెనుకాడడంలేదు. ఇలా వడ్డిపాళెంలో కుటుంబాలను టార్గెట్ చేస్తూ రెండు కార్లలో మంది మార్బలంతో ఆయన అనుచరులు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ విషయమై డీఎల్‌పీవో రవిని వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నదిలో ఇసుక అక్రమ రవాణాకు రాచబాటలు

అడ్డుకుంటే కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులు ◆ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇదీ దందా

ఈనాడు, తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేసేందుకు ఏకంగా దారులు వేస్తున్నారు. అధికారుల అనుమతి లేకుండా తట్టెడు ఇసుక నది నుంచి బయటకు వెళ్లకూడదనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ ఇక్కడ వర్తించడం లేదు. వైకాపా పాలనలో ఇసుక తరలించిన గుత్తేదారుకి స్థానిక అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఏర్పేడు మండలంలోని కొత్తవీరాపురం, తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడు, ఇరుపాక్షిపురం సమీపంలో స్వర్ణముఖినదిలో పొక్లెయిన్లతో రోడ్డు ఏర్పాటు చేసి మరీ రెండు రోజులుగా ఇసుక తరలిస్తున్నారు. స్థానిక పేదలు గృహనిర్మాణం కోసం ట్రాక్టర్ ఇసుక తవ్వుకుంటేనే కఠినంగా వ్యవహరించే అధికారులు కళ్లెదుటే యంత్రాలతో తోడేస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.




తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడు సమీపంలోని స్వర్ణముఖిలో.. ◆ ఏర్పేడు మండలంలోని కొత్తవీరాపురం స్వర్ణముఖిలో అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న దారి

న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న రైతులు

స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతుండటంతో భూగర్భజలాలు పూర్తిస్థాయిలో అడుగంటిపోవడంతో పొలాలు బీడుగా మారుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు రైతులు సిద్ధమయ్యారు.

అక్రమ కేసులు.. బెదిరింపులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటే వివిధ కేసుల్లో ఇరికిస్తామని కొందరు గుత్తేదారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాపై పెద్దల ప్రతాపం ఏమిటని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు

స్వర్ణముఖినదిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతి లేదు. నదిలో రోడ్డు ఏర్పాటు చేయడం, ఇసుక తరలింపులపై తమకు ఎలాంటి సమాచారం లేదు.
– మధుసూదన్‌రావు, తహసీల్దార్, తొట్టంబేడు




చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలోని కేఎంఎం కళాశాల కేంద్రంలో పరీక్ష రాయడానికి విచ్చేసిన అభ్యర్థులు ◆ అమ్మ పరీక్షకు వెళ్లడంతో పిల్లలకు భోజనం తినిపిస్తున్న తండ్రి

జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైన టెట్ పరీక్షలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) మొదటిరోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పుత్తూరులోని శ్రీవేంకటేశ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 60 మందికిగాను 55 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 52 మంది హాజరయ్యారు. రామిరెడ్డి పల్లెలోని ఐయాన్ డిజిటల్‌లో ఉదయం 219 మంది, మధ్యాహ్నం 227 మంది హాజరయ్యారు. విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 63 మంది, మధ్యాహ్నం పరీక్షకు 63 మంది హాజరయ్యారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఉదయం మొత్తం 337 మంది హాజరుకాగా 63 మంది, మధ్యాహ్నం 342 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజయ్యారు.



పరీక్షకు వస్తున్న దివ్యాంగుడు

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఇంజినీరింగ్ చదివే చందు, విష్ణువర్ధన్‌బాబు ఈ నెల 2వ తేదీన జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలు నంద్యాల శాంతరామ్ ఫార్మసీ కళాశాలలో జరిగాయన్నారు. అందులో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపడంతో జేఎన్‌టీయుఏ జట్టులో స్థానం పొందారన్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తదితరులు

జిల్లా సర్వే, భూరికార్డుల శాఖాధికారిగా అరుణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖ అధికారిగా డి. అరుణ్‌కుమార్ గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జయరాజ్‌ను ఇటీవల ప్రభుత్వం నంద్యాలకు బదిలీ చేసిన సంగతి విదితమే. మంగళగిరిలోని ఆ శాఖ కమిషనర్ కార్యాలయంలో శిక్షణ పూర్తిచేసుకున్న అరుణ్ కుమార్‌ను తిరుపతికి జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరుణ్‌కుమార్

ఉద్యోగులు పరిసరాలపై నిఘా ఉంచండి: తితిదే ఈవో

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు విశేషమైన సేవలు అందించాలని, అదే సమయంలో పరిసరాలపై నిఘా ఉంచి సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని డిప్యూటేషన్ సిబ్బందికి తితిదే ఈవో జె.శ్యామలరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల విధులకు హాజరైన ఉద్యోగులను ఈవో, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి దిశానిర్దేశం చేశారు. పోలీసులు, జిల్లా యంత్రాంగం, తితిదే డిప్యూటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం అదనపు ఈవో, సీవీఎస్వో శ్రీధర్ గత బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యంగా గరుడసేవ రోజున ఉండే సమన్వయ సమస్యలు ఈసారి తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, ఇతర ఉన్నతాధికారులు, డిప్యూటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తితిదే ఈవో జె.శ్యామలరావు

శ్రీవారి మాడవీధిలో శునకం కలకలం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న వేళ మాడవీధిలో శునకం ప్రవేశించడంతో కలకలం సృష్టించింది. గురువారం రాత్రి అకస్మాత్తుగా మాడవీధిలోకి ప్రవేశించిన శునకం అటుగా తిరుగుతుండటంతో భక్తులు తితిదే భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం దాన్ని అక్కడి నుంచి తరిమివేశారు. వాహనసేవల సమయంలో గజరాజులు, భక్తుల సందడి నేపథ్యంలో సంబంధిత అధికారులు వరహాలు, శునకాలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీవారిసేలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, తెదేపా నాయకుడు ఎన్. అమర్‌నాథ్‌రెడ్డి, తెదేపా ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, గౌతు శిరీష దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతిలో ఐదు.. జిల్లాలో సున్నా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తుదారుల నుంచి మూడోరోజు పెద్దగా స్పందన కన్పించలేదు. పాడ్యమి కావడంతో సెంటిమెంట్‌గా భావించారు. నగరపాలక పరిధిలో గురువారం ఐదు దరఖాస్తులు అందగా మొత్తం ఎనిమిదికి చేరింది. జిల్లాలో ఎక్కడా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు కాలేదు. ఇక ఆరు రోజులే గడువు ఉండటం.. అందులో ఒకరోజు సెలవు కావడంతో మిగిలిన ఐదు రోజుల్లోనే దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే కొందరు ఆశావహులు స్టేషన్‌కు వచ్చి వివరాలు ఆరాతీస్తున్నారు. గడిచిన మూడు రోజుల్లో జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడానికి.. డీడీలను ప్రభుత్వ ఖాతాకు జమ చేసేందుకు ఎస్‌బీఐ సిబ్బంది అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు. అయితే కొన్ని స్టేషన్లలో అలాంటి సహాయ డెస్కులు కనిపించిన దాఖలాలు లేవు. దీంతో సామాన్యులు దరఖాస్తు విధానంపై అవగాహన పొందలేకపోతున్నారు. దానికితోడు దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు తిరిగిరాదనే భయంతో సామాన్యులు పెద్దగా ముందుకు రావడం లేదు.

మోసం కేసులో ఇరువురికి జైలుశిక్ష

సూళ్లూరుపేట: కంపెనీలో భాగస్వామ్యం ఇస్తామని నమ్మబలికి నగదు తీసుకుని మోసం చేసిన కేసులో ఇరువురికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.24 వేలు జరిమానా విధిస్తూ సూళ్లూరుపేట ఏజేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి ఎస్.అనూష గురువారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. తడ మండలంలోని కట్టువ గ్రామంలో భారత్ సర్క్యూట్స్ కంపెనీలో సూళ్లూరుపేటకు చెందిన కల్లేటి సుబ్రహ్మణ్యంకు భాగస్వామ్యం ఇస్తామని మేనేజింగ్ డైరెక్టర్ టి.నాగార్జునరావు, అతని భార్య స్వరూప నమ్మించి, బాధితుడి నుంచి రూ.25 లక్షలు తీసుకుని, అతన్ని ఫ్యాక్టరీ నుంచి బయటకు గెంటేశారు. దీనిపై తడ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. అనంతరం కోర్టులో కేసుకు సంబంధించి వాదనలు జరుగుతూ వచ్చాయి. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు నాగార్జునరావు, స్వరూపకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.24 వేలు అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సూళ్లూరుపేట ఏపీపీ ప్రకృతి కుమార్ వాదనలు వినిపించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

రేణిగుంట: రేణిగుంట-పుత్తూరు రైలు మార్గంలో గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ పోలీసులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఈ మార్గంలో మహిళ(35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకో పైలట్ తెలపడంతో తాము ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టామన్నారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. శవ పరీక్షల నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



డార్మిటరీలో స్థలాభావంతో యాత్రికుల అగచాట్లు

భక్తులకు శఠగోపం.. దూరమైన వసతి

■ బ్రహ్మోత్సవాల్లో డార్మిటరీల్లోనూ చోటు కష్టమే ■ నేలమట్టమైన గోవిందరాజ సత్రాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే : శ్రీవారిని దర్శించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నాయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వచ్చే భక్తులు మొదటిగా తిరునగరిలో అడుగిడుతారు. ఇక్కడ మోస్తరు ధరకు దొరికే గదులు, తాగునీరు, వసతి, కాలకృత్యాల కోసం ఏర్పాట్లు పెద్దఎత్తున అవసరం కాగా సరిపడా లేవనే చెప్పాలి. దేవస్థానం సముదాయాలు ముందస్తు కేటాయింపులకు, సిఫార్సులకు సరిపోతుండటంతో సామాన్య భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు.

రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే గతంలో గోవిందరాజ స్వామి సత్రాలు భక్తుల అవసరాలకు ఎంతో అనువుగా ఉండేవి. కావలసినన్ని గదులు, తక్కువ అద్దెతో వాటిని నిరంతరం సద్వినియోగం చేసుకొనేవారు. ఒకటో సత్రం స్థానంలో విష్ణు నివాసాన్ని నిర్మించారు. ఇక్కడ ఏసీ గదులు 196, ఎనిమిది నాన్ ఏసీ సూట్లు, నాన్ ఏసీ గదులు 196 మాత్రమే ఉన్నాయి. గదులు దొరకనివారికి ఇక్కడే 11 ఉచిత డార్మిటరీలు ఉన్నాయి. భక్తులందరూ సముదాయం వరండాల్లో సేదతీరాల్సి ఉంటుంది. 714 లాకర్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ పలు రైళ్లలో వచ్చే భక్తులు విష్ణు నివాసాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. అయితే ఇక్కడ గదులు దొరక్క, సరిపోని స్థాయిలో లాకర్లు లేక, డార్మిటరీలో కాసింత స్థలం దొరక్క కష్టాలు ఎదుర్కొంటున్నారు.

ఆగమేఘాల మీద కూల్చివేత

రైల్వే స్టేషన్‌కు వెనుక భాగంలో గోవిందరాజస్వామి సత్రాలు రెండు, మూడు 65 సంవత్సరాల పాటు భక్తుల సేవలో తరించాయి. సామాన్య భక్తులకు అందుబాటులో 950 గదులు ఉండేవి. వాటిని తమ స్వార్థం కోసం గత పాలకులు ఎన్నికల ముందు కూల్చివేయడంతో సామాన్య భక్తులు రోడ్డున పడ్డారు. రూ.418 కోట్లతో నూతన సత్రాలు నిర్మిస్తుండగా అదనంగా సౌకర్యాల కల్పన పేరుతో రూ.182 కోట్లు వెచ్చిస్తున్నారు. బాగున్న సత్రాలు కూల్చేసి భక్తుల సొమ్ము వృథా చేశారనే విమర్శలు అన్నివర్గాల్లోనూ ఉంది. ఇక్కడ నూతన సత్రాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.


అక్కడ గదులు దొరకడం గగనమే..

శ్రీనివాసంలో మొత్తం 505 గదులు ఉండగా ఇందులో 382 నాన్ ఏసీ గదులున్నాయి. తక్కిన ఏసీ గదులన్నీ ఆన్‌లైన్ పద్ధతిలోనే ముందస్తుగా కేటాయిస్తారు. 9 డార్మిటరీలున్నాయి. గదులు దొరకని భక్తుల కోసం 1038 లాకర్లు ఏర్పాటు చేశారు. మాధవంలో గదులు ఉన్నప్పటికీ ఇక్కడా ఆన్‌లైన్ విధానం అమలవుతోంది. డార్మిటరీలు ఉన్నప్పటికీ సర్వదర్శన టోకెన్ల భక్తులు వేచి ఉండేందుకు సరిపోతున్నాయి. అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో గదుల కేటాయింపులు లేవు. ఇక్కడ ఒక డార్మిటరీ మాత్రమే ఉంది. వంద లాకర్లు ఉన్నాయి. వాటిని ఎక్కువగా పోలీసు విజిలెన్స్ విభాగంవారు వినియోగిస్తున్నారు. అలిపిరి లింకు బస్టాండ్ ప్రాంతంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ స్నానాలు, మలమూత్ర విసర్జనకు నిర్మాణాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయి.

◆ ఎస్వీ అతిథిగృహంలో 10 ఏసీ, 21 నాన్ ఏసీ గదులున్నా భక్తులకు అందడం లేదు. ప్రస్తుత కలెక్టరేట్‌ను గతంలో పద్మావతి నిలయంగా వ్యవహరించేవారు. ఇక్కడ పెద్దఎత్తున భక్తులకు ఏర్పాట్లు చేసే అవకాశం ఉన్నా గత ప్రభుత్వం కలెక్టరేట్ అవసరాలకు స్వాధీనం చేసుకోవడంతో భక్తులకు దూరమైంది.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి



వారాహి డిక్లరేషన్‌తో పవన్ కల్యాణ్

ప్రశాంతంగా ముగిసిన పవన్ పర్యటన

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండు రోజుల పర్యటన గురువారం ప్రశాంతంగా ముగిసింది. కల్తీ లడ్డూ వ్యవహారంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం శ్రీవారిని తన ఇద్దరు కుమార్తెలతో పాటు దర్శించుకుని దీక్షను విరమించారు. వారాహి డిక్లరేషన్‌ను స్వామివద్ద ఉంచి ఆశీస్సులు అందుకున్నారు. గురువారం సాయంత్రం అతిథిగృహం నుంచి వారాహి సభకు బయలుదేరి వెళ్లారు. అభిమానులు అతిథిగృహం వద్ద సందడి చేశారు.

క్రీడలతో ఒత్తిడి దూరం



క్రీడా మైదానంలో పీజీ వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: మానసిక ఒత్తిడిని క్రీడలతో అధిగమించవచ్చని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. పీజీ వైద్య విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల, వెటర్నరీ క్రీడా మైదానం, అగ్రికల్చర్ కాలేజ్ క్రీడా మైదానంలో ఈ పోటీలు మూడు రోజులపాటు జరగనున్నాయి. కార్యక్రమంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ పీడీ శరవణన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి(ఆర్టీసీ): బ్రహ్మోత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి టి.చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డీపీటీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తిరుపతి-తిరుమల మధ్య ప్రయాణ సౌకర్యం కల్పించడానికి సన్నాహాలు చేసినట్లు వివరించారు. గరుడసేవ రోజున ద్విచక్రవాహనాల నిషేదం ఉన్నందున, పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలనుంచి బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, బస్‌స్టేషన్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు, చంద్ర పాల్గొన్నారు.

తితిదే సొంత డెయిరీని ఏర్పాటు చేయాలి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: తితిదే సొంత డెయిరీని ఏర్పాటుచేసి అందులో శ్రీవారి భక్తులను భాగస్వామ్యం చేయాలని అఖిల భారతీయ యాదవ మహాసంఘం తిరుమల అధ్యక్షులు శ్రీను యాదవ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో యాదవ సంఘం యువతతో కలిసి మాట్లాడారు. వెంకటాద్రి యాదవ్, రమణ యాదవ్, చంద్రా యాదవ్, మాసుమయ్య, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూలో మోహన్ మంత్ర

చంద్రగిరి గ్రామీణ: ఎ.రంగంపేట సమీపంలోని ఎంబీయూ యూనివర్సిటీలో మోహన్ మంత్ర శుక్రవారం ఉదయం ప్రారంభం కానుంది. 2013 నుంచి మోహన్ మంత్రను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని వర్సిటీ ఈడీ వినయ్ మహేశ్వరి తెలిపారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాఠవాలు ప్రదర్శిస్తారని ఆచార్య నాగరాజు రామారావు తెలిపారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి సుమారు 20 వేల మంది విద్యార్థినీవిద్యార్థులు మోహన్ మంత్రలో పాల్గొనడానికి నమోదు చేసుకున్నారని తెలిపారు.

వేడుకగా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



ఎల్ఎస్‌నగర్‌లోని గోశాల వద్ద శక్తిచాముండేశ్వరి దేవిగా..



చంద్రగిరి: శ్రీఉగ్రప్రత్యాంగిరాదేవి అమ్మవారు



కొత్తవీధి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దీక్షాబంధన అలంకారం



దుర్గసముద్రంలో మూలస్థాన ఎల్లమ్మ



నేండ్రగుంటలో శ్రీబాలాత్రిపుర సుందరిగా మూలస్థానమ్మ

చంద్రగిరి, న్యూస్‌టుడే: గ్రామదేవత శ్రీమూలస్థానమ్మ దేవస్థానంలో కలశస్థాపన పూజలతో దేవీ నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మొక్కల చంద్రశేఖర్‌రెడ్డిలకు రుత్వికులు కంకణం కట్టి ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో కలశస్థాపన, నవగ్రహ పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు.

పాకాల: నేండ్రగుంట శ్రీమూలస్థానమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. మనోహర్‌నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లి శ్రీ సప్తకన్యకల ఆలయంలో పూజలకు ధర్మకర్త ఎల్.ఎస్.నాయుడు, భక్తులు హాజరయ్యారు.

తిరుపతి(బైరాగిపట్టెడ): తాతయ్యగుంట గంగమ్మ ఆలయం, కొంకావీధిలోని కాళ్ళకమ్మ గుడి, కొత్తవీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, పాత తిరుచానూరు రోడ్డులోని అంకాళమ్మ గుడి, శ్రీఅన్నపూర్ణేశ్వరి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెద గంగమ్మ గుడి, పల్లె వీధిలోని వేషాలమ్మ ఆలయం, సప్తగిరి నగర్ లోని ఏడు గంగల గంగమ్మ ఆలయం తోపాటు నగర పరిధిలోని పలు ఆలయాలు దసరా ఉత్సవాలతో సందడిగా మారాయి. శుక్రవారం బాలా త్రిపురసుందరిగా ఆయా ఆలయాల్లో అమ్మవారు కొలువు దీరనున్నారు.

రామచంద్రాపురం: రాయలచెరువు పేటలో వెలసిన శ్రీముత్యాలమ్మ, శ్రీశక్తి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



శ్రీశక్తి పీఠంలో పూజలు నిర్వహిస్తున్న కుర్తాళం పీఠాధిపతి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి కొలువు, పంచాంగ శ్రవణం, మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

న్యూస్‌టుడే, చంద్రగిరి

సమస్య : చంద్రగిరి పంచాయతీలో వీధికుక్కలు 1500 పైగా ఉన్నాయి. ప్రజలపైకి తిరగబడి దాడి చేస్తున్నాయి. వాటి సంతతిని అరికట్టాలి. – రమణయ్య, చంద్రగిరి

సమాధానం: మూడునెలల కిందట టీకాలు వేయించాం. మరోమారు పంచాయతీ తీర్మానంతో నియంత్రణ చర్యలు చేపడతాం. – మహేశ్వరయ్య, పంచాయతీ ఈవో

న్యూస్‌టుడే, రామచంద్రాపురం

సమస్య : కుప్పంబాదూరు పంచాయతీ బాదూరుపేటలో రాయలచెరువు నుంచి ఒడ్డుకాల్వ మీదుగా తిరుపతి - పచ్చికాపల్లం ప్రధాన రహదారిని కలిపే మార్గంలో తాగునీటి పైప్ మరమ్మతులకు గురైంది. – గ్రామస్థులు

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలియచేసి రెండ్రోజుల్లో పరిష్కరిస్తాం. – శ్రీనివాసులు, ఎంపీడీవో

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: కల్‌రోడ్డుపల్లి పంచాయతీ కొత్తఇండ్లు గ్రామం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. పాతకాలంనాటి ఇనుప స్తంభం కిందభాగం చిలుముపట్టి ఓవైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారగా 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన గత నెల 20న సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీడీసీఎల్ అధికారులు నూతన స్తంభాన్ని పాతి సరఫరాను పునరుద్ధరించారు.

బస్ షెల్టర్‌కు నిధుల మంజూరు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు కట్టపై బస్ షెల్టర్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. అనుప్పల్లి, నెత్తకుప్పం, తిమ్మరాజుపల్లి మార్గాల నుంచి కుప్పంబాదూరుకు, తిరుపతికి రాకపోకలు సాగించటానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో గతంలో వెలువడిన కథనానికి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించారు. రూ.3 లక్షల తుడా నిధులు బస్ షెల్టర్ నిర్మాణానికి మంజూరు చేయించడంతో పనులు సాగుతున్నాయి.

కూడలిలో వెలిగిన హైమాస్ట్ దీపాలు


తిరుపతి(గ్రామీణ): వేదాంతపురం జాతీయ రహదారి కూడలిలో హైమాస్ట్ లైట్లు వెలిగాయి. కొన్ని రోజులుగా వెలగక అంధకారం నెలకొనడంపై 'ఈనాడు'లో సెప్టెంబరు 13న కథనం వెలువడింది. స్పందించిన విద్యుత్తుశాఖ అధికారులు నిర్వాహకులతో మాట్లాడి కూడలిలో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

మురుగు నీటిలో ప్రయాణ పాట్లు



స్థానిక అక్కారంపల్లి (కొత్తరోడ్డు) నుంచి కొత్తపల్లి, కొర్లగుంటకి వెళ్లే మార్గంలో మురుగు ముంచెత్తుతోంది. ఆరో వార్డులోని నలంద ప్రైవేటు పాఠశాలకు సమీపంలో రోడ్డుపై నిల్వఉన్న డ్రైనేజీ నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. – న్యూస్‌టుడే, తిరుపతి (భవానీనగర్)

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు జిల్లా పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. రేణిగుంట విమానాశ్రయం నుంచి వాహనశ్రేణి పోలీసు అధికారులు, డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు వివరించారు. కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. శ్రీవారి ఆలయ పరిసరాల్లో తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి ఎస్పీ రిహార్సల్స్ నిర్వహించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

17 మద్యం దుకాణాలకు ప్రతిపాదన



మాట్లాడుతున్న వాసుదేవచౌదరి

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి ఎక్సైజ్ విభాగం పరిధిలో 17 ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ఎక్సైజ్ ఏఈఎస్ వాసుదేవచౌదరి అన్నారు. చంద్రగిరిలోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. చంద్రగిరిలో 7, పాకాల 5, చిన్నగొట్టిగల్లులో 3, యర్రావారిపాలెం మండలంలో 2 దుకాణాలను ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎక్సైజ్ డీటీఎస్‌వో శ్యాంప్రసాద్, సీఐ ఫణీంద్ర, ఎస్సైలు సుధాకర్‌రావు, గిరి పాల్గొన్నారు.

బస్‌పాస్ సేవలకు అంతరాయం

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆర్టీసీ అందించే బస్‌పాస్ సేవలకు అంతరాయం ఏర్పడినట్లు తిరుపతి బస్‌స్టేషన్ సహాయ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) డి.రామచంద్ర నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్ సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా ఈ నెల 5, 6 తేదీల్లో బస్‌పాస్‌ల జారీ ఉండదన్నారు.

కూలిన బస్టాప్.. తప్పిన ప్రమాదం



తిరుపతి (మంగళం) : నగర పరిధిలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మంగళం సమీపంలో వెంకటేశ్వర కాలనీ వద్ద బస్టాప్ కూలిపోయింది. కరకంబాడి రోడ్డు పక్కన ఆర్‌అండ్‌బీ ఏర్పాటు చేసిన బస్టాప్ గాలివానకు నేలకూలగా ఆసమయంలో అక్కడ ఎవరూ లేకుండా పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. 2017లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఇస్కా) నిర్వహణ సందర్భంగా అప్పటి తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్టాప్‌లను వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేసింది. తుప్పిపట్టి కూలిపోయే దశకు చేరాయి. తాజా ఘటనతో కూలేందుకు సిద్ధంగా ఉన్నవాటిని తొలగించాల్సి ఉంది.

■ **న్యాయవాది మృతికి సంతాపం.. తిరుపతి (లీగల్):** న్యాయవాదుల సంఘం సభ్యులు ఎం.సుబ్బరామయ్య (80) మృతికి తిరుపతి న్యాయమూర్తులు, న్యాయవాదులు గురువారం సంతాపం తెలియజేశారు. మూడో అదనపు జిల్లా సెషన్సు కోర్టు పబ్లిక్ హాలులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు టి.గోపిచంద్ పర్యవేక్షణలో తిరుపతి మూడో అదనపు జిల్లా సెషన్సు జడ్జి ఎం.గురునాథ్ అధ్యక్షత సంతాప సభ నిర్వహించారు. అదనపు జిల్లా సెషన్సు జడ్జిలు జి.రామ్‌గోపాల్, టి.రామచంద్రుడు, ఎ.నరసింహమూర్తి, జి.అర్చన, సీనియర్ సివిల్ జడ్జిలు విజయసారథిరాజు, సునీతారాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సీకేవీ సత్యకాంత్ కుమార్, పల్లపోలు కోటేశ్వరరావు, సంధ్యారాణి, వై.సరిత, శ్రీకాంత్, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్ పాల్గొన్నారు.

■ **సమన్వయంతో కృషి చేయాలి.. చంద్రగిరి, న్యూస్‌టుడే:** చంద్రగిరి పంచాయతీ సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేయాలని సర్పంచి రూపా రామ్మూర్తి కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాని చంద్రగిరి పంచాయతీలోని స్వర్ణముఖినది ఒడ్డున 'గోవింద ధామం' ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. పంచాయతీ ఈవో మహేశ్వరయ్య పాల్గొన్నారు.

■ **సెక్యూరిటీ సూపర్‌వైజర్‌తో వాగ్వాదం.. శ్రీకాళహస్తి:** పట్టణంలోని వి.ఎం.పల్లికి చెందిన భద్రతా మాజీ ఉద్యోగిని, సెక్యూరిటీ సూపర్‌వైజర్‌తో వాగ్వాదానికి దిగింది. వైకాపాకు అనుకూలంగా ఉంటూ వచ్చిన ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఉద్దేశ పూర్వకంగానే సెక్యూరిటీ సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగించారనే కారణంతో ఆమె గురువారం దుర్భాషలాడటంపై సంబంధిత సూపర్‌వైజర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

■ **టాస్క్‌ఫోర్స్ ఎస్పీని కలిసిన డీఎఫ్‌వో.. తిరుపతి(జీవకోన):** తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో జి.శ్రీనివాసులు గురువారం ఏపీ టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌ను కలిశారు. ఎర్రచందనం స్మగ్లర్లను కట్టడి చేసే అంశాలపై చర్చించుకున్నారు.

తల్లి మృతదేహంపైనే ప్రాణాలొదిలిన కుమారుడు

రాయలపురంలో విషాద ఘటన






మునెమ్మ, రమేష్ (పాతచిత్రాలు)

చంద్రగిరి, న్యూస్‌టుడే: నవ మాసాలు మోసిన కన్నతల్లి.. తన ఎదుగుదల.. కష్టసుఖాల్లో తోడుగా నిలిచి వెంటనడిచింది. ఇక లేదని తెలిసి ఆ కుమారుడు తల్లడిల్లారు. మృతదేహం వద్ద గుండెలవిసేలా విలపిస్తూనే ప్రాణాలొదిన విషాద ఘటన చంద్రగిరి మండలంలోని రాయలపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు. . రాయలపురం ఎస్టీ కాలనీకి చెందిన ఎన్.మునెమ్మ(60) అనారోగ్యంతో మృతిచెందారు. నవమాసాలు మోసి పెంచిపోషించిన కన్నతల్లి మృతిచెందడంతో తల్లి భౌతికకాయం వద్ద గుండెలవిసేలా విలపించిన తనయుడు రమేష్(45) అక్కడే కుప్పకూలి మృతిచెందారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబ పెద్ద రమేష్ మృతిచెందడంతో కుటుంబం రోడ్డున పడింది. రమేష్‌కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు. కొన్ని గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృతిచెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



బి.హేమకుమార్ (పాతచిత్రం)

చంద్రగిరి, న్యూస్‌టుడే: మూడ్రోజుల కిందట ఇల్లు విడిచివెళ్లిన యువకుడు గురువారం మధ్యాహ్నం బుచ్చినాయుడుపల్లిలోని వ్యవసాయ బావిలో శవమై తేలిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తపేట ద్వారకానగర్‌కు చెందిన శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతుల కుమారుడు బి.హేమంత్‌కుమార్(23) మూడ్రోజుల కిందట తన చరవాణిలోని సిమ్ములు తీసుకుని, ఫోన్ ఇంటిలో పెట్టి వచ్చేశాడు. జాడ కోసం కుటుంబ సభ్యులు అన్నిచోట్లా గాలించినా ఫలితం లేదు. ఈనెల 2న స్థానిక పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుచ్చినాయుడుపల్లికి చెందిన రైతు మునిరత్నం నాయుడు పొలంలోని బావిలో నీటిపై యువకుడి శవం తేలి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రవీంద్రనాథ్, పోలీసులు శవాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. యువకుడి మృతికిగల కారణాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్వర్ణముఖి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై అధికారులు దాడులు నిర్వహించారు. అజ్ఞాత వ్యక్తులు ఇసుక అక్రమ రవాణాపై డయల్ 100, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మరో పది ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. ట్రాక్టర్లు తిరుపతి గ్రామీణ మండలానికి చెందినవిగా అధికారులు గుర్తించి కేసు నమోదుచేశారు.

వరి పొలంపై అడవి పందుల స్వైరవిహారం

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని ఇరంగారిపల్లి సమీపంలోని గుట్టకింద వరి పొలాలపై అడవి పందుల గుంపు స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన రైతు గిరిధర్‌కు చెందిన వరి పొలాన్ని పూర్తిగా తొక్కేశాయి. పందుల దాడి వల్ల 15 బస్తాల ధాన్యం నేలపాలైందని బాధిత రైతు వాపోయారు. వ్యవసాయ విస్తరణాధికారి రమేష్‌నాయక్, వీఆర్వో లోకనాథం, అటవీశాఖ అధికారులు ధ్వంసమైన పొలాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు.

'దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలి'

తిరుపతి (భవానీనగర్): తమ పూర్వీకుల స్థలంలో దుకాణం ఏర్పాటు చేసుకోగా కొందరు దౌర్జన్యం చేస్తూ వ్యాపార సామగ్రిని ధ్వంసం చేసి భౌతికంగా గాయపరిచారని తిరుచానూరు బండ్లమిట్ట వీధికి చెందిన అనుష వాపోయారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. దుకాణ స్థలంపై కొందరు కోర్టులో కేసు వేశారని, విచారణ జరుగుతుండగానే ధ్వంసం చేశారన్నారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

భక్తులకు ఇబ్బందులు తలెత్తితే సహించను

శ్రీకాళహస్తి: దేవీ నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా ముక్కంటి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఆయన కనకాచలంపై కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. వసతులపై ఆరా తీశారు. ముత్యాలమ్మ గుడి వీధి నుంచి ఏర్పాటు చేసిన మెట్ల మార్గంలో షెడ్డు ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా మెట్ల మార్గంపై పట్టలు వేయాలని.. ఎండ సమయంలో వాటిపై నీళ్లుపట్టాలంటూ సూచించారు. ఆలయ ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కలశస్థాపన



దేవీ నవరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలో కలశస్థాపన మహోత్సవం వేడుకగా జరిగింది. ఈ విశేషోత్సవం సందర్భంగా గురువారం జ్ఞానాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి యాగ కలశాలను ఏర్పాటు చేశారు. ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. అలంకార మండపం నుంచి ఊరేగింపుగా అంజిఅంజి వినాయకస్వామి, బాలజ్ఞానాంబిక ఆలయం వద్దకు తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. ● కనకాచలం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం కలశస్థాపన మహోత్సవం ఆగమోక్తంగా జరిగింది.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

గంగ.. పుష్కలంగా



వేసవి జలాశయంలో నిల్వ చేరిన నీరు

వేసవి జలాశయానికి నీళ్లు

పుర ప్రజల దాహార్తి తీర్చే వేసవి జలాశయానికి నీటి నిల్వలు పుష్కలంగా చేరుతున్నాయి. చెన్నై ప్రజల సౌకర్యార్థం కండలేరు జలాశయం నుంచి సత్యసాయి తెలుగుగంగ కాల్వ గుండా అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో ఉన్న వేసవి జలాశయానికి నీటి నిల్వలు సమకూరుతున్నాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వేసవి జలాశయ సామర్థ్యం 67 ఎంసీఎఫ్‌టీలు మాత్రమే. ఒకసారి నిండుగా నీటి నిల్వలు సమకూరితే నాలుగు నెలల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులుండవు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. కండలేరు జలాశయం నుంచి చెన్నైకు తాగునీరు సరఫరా చేసే సమయంలో ఇక్కడి వేసవి జలాశయాన్ని నింపుకోవడం, అవసరమైన మేర తాగునీటిని పంపిణీ చేస్తూ రావడంతో వీలైనంత వరకు తాగునీటి ఇబ్బందులు తప్పుతున్నాయి. సామర్థ్యం పెంపుదలతో మరింతగా నీటిని నిల్వ చేసుకునే అవకాశముంది. దీనిపై వైకాపా హయాంలో ప్రణాళికలు సిద్ధమైనా ఆ దిశగా పాలకులు శ్రద్ధ చూపని కారణంగా వేసవి జలాశయ సామర్థ్యం పెంపు దస్త్రాలకే పరిమితమైంది.

జాగ్రత్తలు పాటించాలి

అడపాదడపా వర్షాలు పడుతుండటం, తెలుగుగంగ కాల్వ నుంచి కొత్తగా వేసవి జలాశయానికి నీటి నిల్వలు పంపింగ్ జరుగుతున్న క్రమంలో ప్రజలు కాస్తంత జాగ్రత్తలు పాటించాలంటూ పురపాలక కమిషనర్ బీపీఎస్ గిరికుమార్‌తో పాటు పలువురు అధికారులు కోరుతున్నారు. ప్రధానంగా తాగునీటిని కాచి తాగితే ఎంతో శ్రేయస్కరమని చెప్తున్నారు. లీకేజీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఇంజినీరింగ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

పట్టణ జనాభా:	91,247
నివాస గృహాలు:	23,619
రక్షిత మంచి నీటి పథకాలు:	09
కుళాయి కనెక్షన్లు:	7329
చేతిపంపులు:	327
పవర్ బోర్లు:	34
రోజువారి తాగునీటి వినియోగం:	9.5 ఎంఎల్‌డీ
రోజువారి తాగునీటి పంపిణీ:	7.8 ఎంఎల్‌డీ



శ్రీకాళహస్తి: స్వర్ణకవచాలంకరణలో..











నారాయణవనంలో ● శ్రీకాళహస్తిలో... ● సత్యవేడులో.. ● వరదయ్యపాళెంలో.. ● ఏర్పేడులో..

నవరాత్రి.. నవ్యధాత్రి



నాగలాపురంలో..

శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో గురువారం పూజలు నిర్వహించారు. ఆలయాల్లోని అమ్మవారు బాలాత్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం

శ్రీవేదాంత దేశికర్ ఉత్సవం



తిరుచ్చిపై శ్రీవేదాంత దేశికర్

నారాయణవనం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేదాంత దేశికర్ శాత్తుమొర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు చేసి నిత్యకైంకర్య పూజలు చేపట్టారు. సాయంత్రం దేశికర్‌ను విశేషంగా అలంకరణ చేసి తిరుచ్చిపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం, న్యూస్‌టుడే: శ్రీఅవనాక్షమ్మ ఆలయంలో గురువారం కలశస్థాపన చేసి, గణపతి, నవగ్రహ పూజలు నిర్వహించి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు, ఆలయ అర్చకులు పన్నీర్ సెల్వం పేర్కొన్నారు.

ఉత్తమ రక్తదాత పురస్కారం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పీఎస్ నెల్లూరులో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో వేడుకలు నిర్వహించారు. అత్యధికంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు, దాతలకు ఉత్తమ పురస్కారాలను అందించారు. వరదయ్యపాళెంకు చెందిన 'బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్' ద్వారా పలు సామాజికసేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసిన ఆ సంస్థ అధ్యక్షుడు రియాజ్ రెడ్‌క్రాస్ ఛైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ రక్తదాత సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

పవన్‌కల్యాణ్‌కు ఘన వీడ్కోలు



విమానాశ్రయంలోకి వెళ్తున్న పవన్ కల్యాణ్

రేణిగుంట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. మూడు రోజుల జిల్లా పర్యటన అనంతరం గురువారం రాత్రి ఆయన ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు. శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు వీడ్కోలు పలికారు.

వ్యవసాయం లాభసాటిగా మార్చడమే లక్ష్యం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమంలో భాగంగా వ్యవసాయం లాభ సాటిగా మార్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని తెదేపా మండల అధ్యక్షుడు ఎం.సుధాకర్‌నాయుడు అన్నారు. గురువారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏవో భారతి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

పచ్చదనం, పరిశుభ్రతకు కృషి చేద్దాం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రతకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప ఆర్జేడీ డా.బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్వీపీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు)

సమస్య: మండలంలోని జింగిలిపాళెంలో మురుగు కాలువలు సక్రమంగా లేక పోవడం, పూడిపోవడంతో మురుగు నీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- రాము, స్థానికుడు**

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో చర్చించి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. అవసరమైన చోట్ల మురుగు కాలువలు నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. **- పఠాన్ రఫీఖాన్, ఎంపీడీవో, శ్రీకాళహస్తి**

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: రామచంద్రాపురం గ్రామంలో రోడ్లపైకి ఇళ్లల్లోని మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి నివాసాల నుంచి మురుగునీరు రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. **- సుమతి, స్థానికురాలు**

సమాధానం: నివాసాల నుంచి మురుగునీరు రోడ్లపై వదిలిపెట్టే వారికి అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు అందిస్తాం. **- సురేష్‌బాబు, ఎంపీడీవో, తొట్టంబేడు**

న్యూస్‌టుడే, సత్యవేడు

సమస్య: మండలంలోని ఆంబాక్కం పంచాయతీలోని పేరడం, ఆంబాక్కం గ్రామ ప్రజలు అత్యవసర సమయాల్లో రాత్రుల్లో సత్యవేడుకు, ఊత్తుకోటకు బయటకు వెళ్లాలన్నా కుక్కలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- సురేష్, స్థానికుడు**

సమాధానం: కుక్కలకు టీకాలు వేయించి, కుక్కలతో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- సునీల్, పంచాయతీ కార్యదర్శి**

ముఖ్యమంత్రి వాహన శ్రేణి పరిశీలన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రేణిగుంట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పర్యటన భాగంగా పోలీసులు కాన్వాయ్ ట్రయల్ రన్‌ను గురువారం నిర్వహించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించుటకు చంద్రబాబు శుక్రవారం ఇక్కడికి వస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో రేణిగుంట విమానాశ్రయం నుంచి ట్రయల్ రన్ నిర్వహించారు. వాహన శ్రేణి పోలీసు అధికారులు, డ్రైవర్లకు పాటించవలసిన జాగ్రత్తలు వివరించారు.

పాఠ్యాంశాలు తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: సాంఘికశాస్త్రంలో సిలబస్‌ను తగ్గించాలని రాష్ట్ర పరీక్షా విభాగం ఉప కమిషనర్ శ్రీనివాసులకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. సోషల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనాటి సురేష్ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ పరీక్షా విభాగం సంచాలకుల కార్యాలయానికి చేరుకుని సమస్యలు విన్నవించుకున్నారు. మారిన పదోతరగతి సాంఘికశాస్త్రం సిలబస్‌లో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి అన్నాజీ, నారాయణ, వీవీరాజు పాల్గొన్నారు.

స్థలాల సంరక్షణ లక్ష్యంగా సూచికలు



పట్టణంలోని పలు ప్రాంతాల్లో పురపాలక సంఘాలకు సంబంధించిన స్థలాలున్నాయి. గతంలో ఇక్కడి స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సిద్ధం చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురపాలక సంఘ స్థలాల్లో సూచికలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే శిక్షార్హులంటూ సూచికలు ఏర్పాటు చేశారు. ఎక్కడ ప్రభుత్వ స్థలాలు కబ్జా అయి పోతాయేమోనని ఆవేదనకు గురవుతున్న అక్కడి స్థానికులు సూచికల ఏర్పాటుతో ఊపిరి పీల్చుకున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మండల పరిషత్ ఏఈగా ఇబ్రహీంఖాన్

సత్యవేడు: స్థానిక మండల పరిషత్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఇబ్రహీంఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాలలో పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

45 రోజుల్లో ఆసుపత్రి రూపురేఖలు మారుస్తాం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: రానున్న 45 రోజుల్లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి రూపురేఖలు మారుస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం నేతలతో కలిసి ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాలింతలకు సౌకర్యవంతమైన 70 పడకలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆక్సిజన్ ప్లాంటుకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మరమ్మతులకు గురైన శుద్ధినీటి ప్లాంట్‌ను మల్లాడి డ్రగ్స్ సహకారంతో మరమ్మతు చేయనున్నట్లు తెలిపారు. తెదేపా హయాంలో నెలకొల్పిన డయాలసిస్ కేంద్రానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, నేతలు విజయ్‌కుమార్ నాయుడు, కంఠా రమేష్, జయచంద్రనాయుడు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఆర్జేడీ బృందం పరిశీలన



జూనియర్ కళాశాలలోని అదనపు గదులు పరిశీలిస్తున్న ఆర్జేడీ, అధికారులు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై అవకాశాలను పరిశీలించేందుకు కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) డా.పి.బాబు నేతృత్వంలో అధికారుల బృందం గురువారం వరదయ్యపాళెంలో పర్యటించారు. స్థానిక తెదేపా యువ నాయకుడు వెంకయ్య గత నెల ఆగస్టు 3న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా వరదయ్యపాళెంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కళాశాలకు అవసరమైన వసతులపై తగు నివేదిక ఇవ్వాలనే ఆదేశాల మేరకు ఆర్జేడీ బృందం స్థానిక జూనియర్ కళాశాలకు చేరుకుని వసతులపై కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, స్థానిక నాయకులతో చర్చించారు. కూటమి నాయకులు యుగంధర్‌రెడ్డి, నరసరాజు, నూతలపాటి హరిప్రసాద్ చౌదరి, గుత్తి త్యాగరాజు, దిలీప్‌రాయల్, తడ శ్రీను, జానకీరామ్‌యాదవ్ పాల్గొన్నారు.

జానకాపురంలో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని జానకాపురంలో సర్పంచి భాస్కర్‌రాజు పారిశుద్ధ్య పరిరక్షణకు గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. రహదారులపైనే చెత్తాచెదారాలతో అధ్వాన పారిశుద్ధ్యంపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన మంగళవారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. కాలువలను శుభ్రం చేయించి చెత్తచెదారాలను తొలగించారు.

'విశాఖ ఉక్కు ప్రైవేటుపరం చేస్తే ఊరుకోం'

సత్యవేడు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తే ఊరుకునేది లేదని సీపీఎం నాయకుడు రమేష్ హెచ్చరించారు. భాజపా వైఖరిని నిరసిస్తూ గురువారం స్థానిక క్లాక్ టవర్ వద్ద వామపక్ష నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు రఘునాథ్, సుబ్రహ్మణ్యం, కృష్ణయ్యస్వామి, చంద్రబాబు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడికి నివాళి

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ముఖ్యులు పి.జె.చంద్రయ్యశెట్టి మృతికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం చంద్రయ్యశెట్టి స్వగృహానికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చారు.

కళాశాలలో అవకాశం ఇవ్వద్దు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జూనియర్ కళాశాలలో టపాసుల విక్రయాలకు అనుమతి ఇవ్వొద్దంటూ పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జాకీర్ గురువారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందడం లేదు

సత్యవేడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు మురళి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు నాగార్జున మండిపడ్డారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయ ఎదుట విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఎంఈవో రవి పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతుందని ఆరోపించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాగలాపురం, న్యూస్‌టుడే: కృష్ణాపురంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైనట్లు ఎస్‌హెచ్‌వో హనీఫ్‌మహమ్మద్ పేర్కొన్నారు. తిరుపతికి చెందిన షణ్ముగం(50), నాగలాపురం మండలం కారణిలోని తన కుమార్తె అశ్వినీ(25)ని అత్తగారింట్లో వదిలిపెట్టడానికి గురువారం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో కృష్ణాపురంలోని ఓ చెట్టు వద్ద ఆగారు. అదే సమయంలో చెన్నై నుంచి పుత్తూరు వెళ్తున్న లారీ అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనం ధ్వంసం కాగా.. పక్కనే నిలబడి ఉన్న షణ్ముగం, అశ్వినీలకు స్వల్పగాయాలయ్యాయి.

మద్యం సీసాలు స్వాధీనం

నాగలాపురం: నందనం వద్ద గాంధీజయంతి నిబంధనావళి ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వెంకటేష్, గురవయ్యపై కేసు నమోదు చేసినట్లు 75 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ఏటీఎం మూతతో అవస్థలు



స్థానిక మసీదు వీధిలోని ఎస్‌బీఐ ఏటీఎం మూసివేయడంతో వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. మూడు నెలలుగా డిపాజిట్ మిషన్ పనిచేయక పోవడంతో ఖాతాదారులు సంబంధిత బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయక సరిహద్దు ప్రాంతం తమిళనాడులోని మాదరపాకం, ఊత్తుకోటకు వెళ్లి డిపాజిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిపాజిట్ మిషన్ ఉన్న దానిని అందుబాటులోకి తీసుకురాక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజులో రెండు, మూడు గంటలు తప్ప మిగిలిన టైంలో ఏటీఎంను మూసివేస్తున్నారు. పట్టణంలోని మరో రెండు ఏటీఎంలు ఎప్పుడు పని చేస్తాయే తెలియని పరిస్థితి. తమకు ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంట్ ఉండి వేరే ఏటీఎంలకు ఎందుకు వెళ్లాలని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, సత్యవేడు

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	123
లేయర్	110
బ్రాయిలర్స్	222
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	248
లేయర్ మాంసం	187

బాధ్యతల స్వీకరణ

కోట, న్యూస్‌టుడే: కోట తహసీల్దారు ఉప తహసీల్దారుగా అజ్మతుల్లాఖాన్ బాధ్యతలు గురువారం స్వీకరించారు. అలాగే సర్వేయర్‌గా గోపి, ఆర్ఐగా మధులత బాధ్యతలు స్వీకరించారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రరెడ్డి కోరారు. అమరావతిలో గురువారం ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, రహదారుల అనుసంధానం వంటి పనులు ఉపాధి హామీ ద్వారా కేటాయించాలని విన్నవించినట్లు నాగేంద్రరెడ్డి తెలిపారు. సోలార్ ప్రాజెక్టులు పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని కోరినట్లు వివరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో నాగేంద్రరెడ్డి

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో పలువురు గ్రామ పంచాయతీల కార్యదర్శులను బదిలీ చేశారు. అరవపెరిమిడి కార్యదర్శి సిహెచ్ గోవిందయ్యను విన్నమాలకు, పండ్లూరు కార్యదర్శి వెంకట్రారావును విన్నమాలకు, మర్లపలికి చెందిన జి.మోహన్‌రూపాదేవిని అరవపెరిమిడికి, అన్నమేడుకు చెందిన ఎం.గోపాల్‌ను గొట్టిప్రోలు, కోట మండలం ఉత్తమ నెల్లూరు చెందిన ఎన్.అనితారెడ్డిని అన్నమేడు, నెల్లూరు జిల్లా కోవూరు మండలం లేగుంటపాడుకు చెందిన ఏం.ఆశోక్‌కుమార్‌ను మేనకూరుకు. చిల్లకూరు మండలం తొణుకుమాలకు చెందిన ఎం.రాజశేఖర్‌రెడ్డి కాపులూరుకు, తడ మండలం కొండూరుకు చెందిన కె.శివశంకర్‌ను మర్లపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



అవార్డు అందుకుంటున్న బీజేవైఎం నాయకుడు మనోజ్‌కుమార్

గూడూరు వాసికి బెస్ట్ మోటివేటర్ అవార్డు

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణానికి చెందిన బీజేవైఎం నాయకుడు మనోజ్‌కుమార్‌కు నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నట్లు గురువారం తెలిపారు. అధిక రక్తదాన శిబిరాలు, 200 యూనిట్లు రక్తదానం చేయించడంతో అవార్డు అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో విరివిగా రక్తదానం అందిస్తామని తెలియజేశారు.

నత్తనడకన ఎస్టీపీ పనులు

● గతంలో హడావుడిగా పనులు ప్రారంభం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు హడావుడిగా ఎస్టీపీ ప్లాంట్ పనులు మొదలు పెట్టారు. అప్పట్లోనే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా గుత్తేదారుకు కేటాయించగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. తూతూమంత్రంగా పనులు మొదలుపెట్టి తర్వాత ఆపేశారు. ఈ పనులు ఓ ప్రణాళిక మేరకు జరగడంలేదని స్థానికులు అంటున్నారు.

■ నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని మురుగునీటిని శుద్ధ జలాలు చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.7.50 కోట్లు కేటాయించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పనుల కేటాయింపులో గుత్తేదారులు పనిని కైవసం చేసుకున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడ పనులు మొదలు పెట్టి విన్నమాల కాలువ జాతీయ రహదారి నుంచి చెరువు సమీపంలోని ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతం వరకు గ్రావెల్ రోడ్డు వేశారు. యంత్రాలతో గోతులు తీసి కాంక్రీట్ పనులు చేసి ఇటీవల కొన్ని రోజులు పనులు ఆపేశారు. గుత్తేదారు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులతో ఈ పనులు విషయమై చర్చించారని తెలుస్తోంది. దీంతో మళ్లీ పనులు మొదలు పెట్టారు. నాయుడుపేట పట్టణంలోని నివాసాల నుంచి విడుదలయ్యే మురుగునీరు విన్నమాలకాలువలో కలుస్తుంది. స్థానిక లోతువానిగుంట నుంచి జైహింద్ కాలనీ, వెంకటగిరి రోడ్డు, రజక కాలనీ, ఆకుతోట వీధి, మార్కెట్ సెంటర్, ఆర్మూగనగర్, ఎస్ఎస్ఆర్ కాలనీల మీదుగా జాతీయ రహదారి దాటి విన్నమాల చెరువులోకి మురుగునీరు చేరుతోంది. గత ప్రభుత్వంలో నిధులు కేటాయించడంతో విన్నమాల చెరువు సమీపంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో యంత్రాల ద్వారా మురుగునీటిని శుద్ధ జలాలుగా చేసి చెరువులోకి చేరేలా చేయనున్నారు. ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో భారీ వర్షాలకు నీరు చేరే అవకాశముంది. యూనిట్ ఎప్పుడూ నీళ్లలో ఉంటుంది. అక్కడే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని ప్లాంట్ ఏర్పాటుచేస్తే వరద తాకిడికి ముప్పు లేకుండా ఉంది. నీట మునిగే చోట ప్లాంట్ పనులు చేస్తున్నారు. అక్కడికి రాకపోకలు సాగించేందుకు సమస్యగా ఉంటుంది. పురపాలక పాలకవర్గం ఈ ప్లాంట్ పనులను గుట్టు చప్పుడు కాకుండా ప్రారంభించింది.




నాయుడుపేట విన్నమాల కాల్వ ఆనుకుని రోడ్డు ఏర్పాటు ● ప్లాంట్ వద్ద యంత్రాలు పనులు

మిగిలిన డ్రైనేజీల పరిస్థితి ఏంటి?

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు మీదుగా భారీ డ్రైనేజీ కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా ఎక్కువ మురుగునీరు రైల్వే బ్రిడ్జి వరకు చేరుతుంది. అన్నమేడు సప్లయ్ చానల్‌లోనూ మురుగు నీరు పారుతోంది. విన్నమాల కాలువకే కోట్లు ఖర్చు చేస్తే మిగిలిన ప్రధాన రెండు డ్రైనేజీ కాల్వల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నగా ఉంది. ఈ విషయమై కమిషనర్ ఫజులుల్లా వివరణ కోరగా ఎన్నికలకు ముందు పనులు మొదలు పెట్టారని, తాజాగా పనులు చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రతిపాదించిన స్థలంలోనే పనులు జరుగుతున్నాయన్నారు.

ఉత్సాహం... జెండా ఉత్సవం

నృత్యాలతో అలరించిన కళాకారులు

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలో నిర్వహించే జెండా పండగ ఎంతో ఉత్సాహంగా, సంప్రదాయ బద్ధంగా, యువత, కళాకారులు, వివిధ వేషధారణలో నృత్యాలు చేస్తూ, డీజే సౌండ్లతో పట్టణ, పురవీధుల్లో ఎక్కడ చూసిన కోలాహలం వాతావరణం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువజామున వరకు ఆంజనేయస్వామి చిత్రాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, ట్రాక్టర్లపై పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవానికి గూడూరు, పరిసర ప్రాంతాల ప్రజలు రావడంతో వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కుమ్మరివీధి ప్రాంతంలో ఆంజనేయస్వామి ఉత్సవం



నృత్యాలు చేస్తున్న కళాకారులు



నరకానికి నకలు ఈ రోడ్డు

కోట-తిమ్మానాయుడుపాళెం ర.భ రోడ్డు గుంతలమయమై నరకానికి నకళ్లుగా తయారైంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే ఈ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. రెండేళ్ల కిందట రోడ్డు విస్తరణ పేరుతో పనులు చేపట్టారు. ఏడాది కిందట పనులను అర్థాంతరంగా నిలిపి వేశారు. దీంతో రోడ్డు దారుణంగా తయారైంది. ఈ విషయమై ర.భ అధికారులు మాట్లాడుతూ త్వరలోనే పనులు చేపడుతామని చెప్పారు.

- న్యూస్‌టుడే, కోట



కోటలో మహంకాళీ అలంకారంలో కోటమ్మదేవత



బాలాత్రిపురసుందరి అలంకారంలో దుర్గామల్లేశ్వరి



సూళ్లూరుపేటలో పరమేశ్వరి అలంకారంలో చెంగాళమ్మ



సూళ్లూరుపేట: నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అలంకారం



ప్రత్యేక అలంకరణలో శ్రీ కామాక్షి అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

కోట, న్యూస్‌టుడే: కోట, చిట్టమూరు మండలాల గ్రామదేవతల ఆలయాల్లో గురువారం ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. కోటలోని కోటమ్మదేవత, వైష్ణవీదుర్గాదేవి ఆలయాల్లో కలశపూజలతో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల మహకాళీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి, గూడలిలోని రామలింగచామండేశ్వరిదేవి అమ్మవార్లు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు. **నాయుడుపేట, గూడూరుపట్టణం, చిల్లకూరు, వాకాడు:** నాయుడుపేట, గూడూరుపట్టణం, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో గురువారం నుంచి శరన్నరాత్రులు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజలు ఉభయదారుల ఆధ్వర్యంలో వేడుకగా జరిగాయి. **సూళ్లూరుపేట:** పట్టణంలోని నాగేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారు ఒక్కొక్క అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కాకి శ్రీరామమూర్తి, పైడిమర్రి కిషోర్ పాల్గొన్నారు. నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మాజీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లు చేశారు. అలాగే చెంగాళమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజలకు విశాఖపట్నానికి చెందిన పి.నాగేశ్వరరావు, రాధ, పరమేశ్వరి అలంకారానికి చెన్నైకు చెందిన శింగన ఓబుల్‌రెడ్డి, పద్మజారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో తితిదే పాలకమండలి మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.



సౌభాగ్యలక్ష్మిగా కొలువుదీరిన ఆదిలక్ష్మి అమ్మవారు



తడ: గొల్లలమలువు నుంచి ఊరేగింపుగా అమ్మణ్ని ఆలయానికి తరలుతున్న సారె

వేడుకగా అమ్మణ్నికి పుట్టింటి సారె

తడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరికి పుట్టిళ్లుగా భావించే తడ మండలం కొండూరు పంచాయతీ గొల్లలములువు నుంచి ఆడపడుచు సారెను గ్రామస్థులు గురువారం వేడుకగా తరలించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్యన వేనాటి కుమారస్వామిరెడ్డి ఇంటి నుంచి సారె బయల్దేరింది. ముందుగా గ్రామదేవత పోలేరమ్మకు మొక్కులు చెల్లించి కాలినడకన సారెతో గ్రామ ప్రజలు చెంగాళమ్మ ఆలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి, సుమంత్‌రెడ్డి, చంద్రారెడ్డి, మనోజ్ కుమార్‌రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శులకు స్థానచలనం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పలువురు గ్రామ కార్యదర్శులను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులందినట్లు ఈవోపీఆర్డీ మోహన్‌రాజు తెలిపారు. గతంలో మండలంలోని 24 పంచాయతీలకు 16 మంది ఉండే వారని తాజా నియామకాలతో రెండు పంచాయతీలు మినహా మిగతా చోట్ల భర్తీ అయినట్లు వివరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నాయుడుపేట పట్టణం: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు కూడలి ప్రాంతాల్లో బుధవారం రాత్రి నిద్రిస్తున్న నిరాశ్రయులకు ఉపాధ్యాయులు ప్రసాద్, సుబ్రమణ్యం, ఈశ్వరయ్య, స్థానికులు కలిసి దుప్పట్లు ఆహారం తాగునీరు అందించారు. వీరు పట్టణంలోని అన్ని కూడళ్లలో తిరిగి అందించారు.

కల్తీ లడ్డూ నిందితులను శిక్షించాలి

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూని కల్తీ చేసిన నిందితులను వెంటనే శిక్షించేలా సిట్ దర్యాప్తు వేగవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరుపట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద ర్యాలీ చేపట్టి గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా జరుగుతున్న సంఘటనలను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ప్రతినిధులు మురళీరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మండలం అన్నమేడు స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీఐ బాబి గురువారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా పరిధిలో 227 మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని జిల్లా డీపీఈవో కె.నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నాయుడుపేట ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలో 13, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో రెండు చొప్పున మద్యం దుకాణాలు కేటాయించారన్నారు. ఒక్కో దుకాణానికి రూ.2 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలు ఏర్పాటు తర్వాత నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో వెంట ఏఈఎస్ ఉషాశ్రీ, అరుణకుమారి, బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరెడ్డి, అధికారులు

జనసేన నేతకు రెడ్‌క్రాస్ అవార్డు ప్రదానం

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు మండలం వాలమేడు గ్రామానికి చెందిన జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్‌కు నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతిభ అవార్డును గురువారం అందజేశారు. అత్యధికంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, 95 మంది వద్ద రక్త సేకరణ వంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని జనసేన కార్యకర్తలు, కూటమి నేతలు ఆయనను అభినందించారు.

పొలం పిలుస్తోంది

డక్కిలి, న్యూస్‌టుడే: మండలంలోని తీర్థంపాడు, ఆల్తూరుపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, భూసార పరీక్షలు, రాబోవు రబీ కాలానికి అనువైన వరి రకాలు, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఆనంద్, ఏవో విజయ భారతి, రైతులు పాల్గొన్నారు. **కోట:** కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరు విత్తనశుద్ధి చేసుకొన్న తరువాతే నార్లు పోయాలన్నారు. అప్పుడే తెగుళ్లు సోకుండా దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **నాయుడుపేట:** మండలంలో కల్లిపేడు, నరసారెడ్డి కండ్రిగ గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో జే గణేష్ రైతులకు నాణ్యత కలిగిన వరి విత్తనాలు ఎంపిక, భూమి సారవంతం, విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువులు వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్తు లోక్ అదాలత్

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి నెల్లూరు జిల్లా కలువాయి మండల కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు డిస్కం ఈఈ నరేంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు పట్టణం, మండలం, కోట సబ్ డివిజన్‌కు సంబంధించి వినియోగదారులు సమస్యలు పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సంఘాలను బలోపేతం చేయాలి

కోట, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి అర్హులైన సభ్యులందరికి ప్రభుత్వ పథకాలు అందించాలని కోట ఏపీఎం అనీలకుమారి పేర్కొన్నారు. కోటలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఆమె సంఘాల సభ్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ వర్ధంతి

నాయుడుపేట, న్యూస్‌టుడే: తిరుపతి మాజీ ఎంపీ, మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్ వర్ధంతిని గురువారం ఆయన అభిమానులు, బంధువులు నిర్వహించారు. నాయుడుపేట పాత బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బల్లి దుర్గాప్రసాద్ సోదరుడు మాజీ ఎంపీటీసీ బల్లి జయప్రసాద్ పేదలకు అన్నదానం చేశారు.

తాగునీరు.. అందని తీరు

● ప్రజలకు తప్పని అవస్థలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కేంద్ర ప్రభుత్వం తలచింది. ఇందుకు జల జీవన్ మిషన్ పేరుతో పథకాన్ని అమలు చేసింది. రూ.కోట్లు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పనులు సాగలేదు. పలుచోట్ల గుత్తేదారులు నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఫలితంగా శుద్ధజలం అందని ద్రాక్షగా తయారైంది. ఈ పరిస్థితి దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో నెలకొంది.

■ దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి పంచాయతీలో అన్ని నివాస ప్రాంతాల్లో జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటిని ఇంటింటికి అందించేందుకు వీలుగా ప్రభుత్వం రూ.48.29 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు రూ.13.15 లక్షల పనులు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా రూ.35.14 లక్షలు పనులు చేయాల్సి ఉంది. చేసిన పనుల్లో కూడా నాణ్యత అంతంత మాత్రమే. జల జీవన్ మిషన్ ఉద్దేశం ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్లి కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఈ పంచాయతీలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. వీధుల్లోనే కుళాయిలు ఏర్పాటు చేసి గుత్తేదారు చేతులు దులుపుకున్నాడు. హరిజనవాడలో ఓ ప్రాంతంలో పైపులైన్ వేసి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. వివాదాలు ఏర్పడి ఏర్పాటు చేసిన కుళాయిలను సైతం గుత్తేదారు తొలగించారు. దీంతో గుక్కెడు నీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు.




శ్రీధనమల్లిలో వీధుల్లోనే కుళాయిలు ఏర్పాటు ●ఇక్కడ పైపులైన్లు వేసినా కుళాయి లేని దృశ్యం

నిధుల ఖర్చు ఇలా..

శ్రీధనమల్లి పంచాయతీకి జలజీవన్ మిషన్ కింద రూ.48.29 లక్షలు మంజూరు చేశారు. ఇందులో శ్రీధనమల్లి హెచ్‌డబ్ల్యూలో రూ.4.85 లక్షలు, పీవీకండ్రిగలో రూ.1.15 లక్షలతో పనులు చేశారు. ఇక్కడ రూ.7.15 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు ఇంజినీర్ల దస్త్రాలు చెబుతున్నాయి. మానేరిలో రూ.17.14 లక్షలు, శ్రీధనమల్లిలో రూ.18 లక్షల విలువైన పనులను ప్రారంభించలేదు.

■ శ్రీధనమల్లి పంచాయతీలో గుక్కెడు తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ పనులు ప్రారంభం కాలేదు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోయారు.

■ కోటపోలూరు గ్రామ పంచాయతీలో జల జీవన్ మిషన్ కింద రూ.76.99 లక్షల మంజూరు కాగా రూ.52.99 లక్షల పనులు మాత్రమే చేశారు. మిగిలిన రూ.24 లక్షలు పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం పంచాయతీలో పలుచోట్ల తాగునీరు సక్రమంగా రావడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

శ్రీధనమల్లి పంచాయతీలో పనులు సక్రమంగా చేయకపోవడంతో పాటు, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయని విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకుంటాం. కోటపోలూరులో పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

గంజాయి పట్టివేత

వెంకటగిరి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 18 కేజీలు గంజాయిని పట్టుకున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం పెరంబూర్‌కు చెందిన షేక్ కైఫ్ ఒరిస్సా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి రైల్లో వెంకటగిరికి చేరుకున్నాడు. ఇక్కడ నుంచి చైన్నెకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతని నుంచి రూ.1.98 లక్షలు విలువ చేసే 18 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇతన్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచి రిమాండ్‌కు తరలించామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, ఏఎస్సై బి.వి.రమణయ్య, సిబ్బంది రాజేంద్రప్రసాద్, జయచంద్ర పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంటెంట్ నాగమల్లేశ్వరిరెడ్డి పేర్కొన్నారు. సూళ్లూరుపేటలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. విలేకర్లతో మాట్లాడుతూ సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో 21 మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు కోరామని చెప్పారు. ఇందులో సూళ్లూరుపేటలో 14, తడ 5 దొరవారిసత్రం 2 దుకాణాలు ఉన్నట్లు ఆయన వివరించారు.

ఉత్సవాల్లో యువత ఘర్షణ...

ముగ్గురికి గాయాలు

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరులో ఎంతో ప్రశాంతంగా జరిగే జెండా ఉత్సవాల్లో కొంత మంది ఆకతాయిలు వల్ల ఘర్షణలు నెలకొన్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు నిర్వహించిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో ముగ్గురు యువకులకు వేరువేరు ఘటనలో కత్తితో గాయాలైన సంఘటన గురువారం వేకువజామున చోటు చేసుకుంది. పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపిన వివరాలు మేరకు... తిరుమలకు చెందిన హరీష్ జెండా పండగకు చిన్న మసీదు వీధిలో బంధువులు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో హరీష్, బంధువైన యశ్వంత్ కలిసి మసీదువీధి వద్ద ఉత్సవాలు తిలకిస్తుండగా కొంత మంది ఆకతాయిలు ఘర్షణ పడుతున్నారు. ఈ ఘటనలో పట్టణంలోని అరుంధతీయపాలెంకు చెందిన గోవింద్ యశ్వంత్‌పై పడడంతో ఎందుకు పడ్డావని ప్రశ్నించాడు. దీంతో కోపంతో గోవిందు తన వద్ద ఉన్న కత్తితో హరీష్, యశ్వంత్‌పై దాడి చేయగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటీన పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షల నేపథ్యంలో.. జెండా ఉత్సవంలో జరిగిన మరో ఘటనలో పట్టణంలోని శివాలయంవీధి వద్ద అబ్దుల్‌రెహ్మాన్, భాస్కర్ జెండా ఉత్సవాలు తిలకిస్తున్నారు. ఈ నేపథ్యంలో భాస్కర్‌కు, పట్టణంలోని రాణిపేటకు చెందిన ఇమ్మానియేలుకు పాతకక్షల నేపథ్యంలో గొడవపడ్డారు. వారిద్దరిని అబ్దుల్‌రెహ్మాన్ వేరుచేస్తుండగా ఇమ్మానియేలుతో వచ్చిన శ్రీనాథ్ కత్తితో అబ్దుల్‌రెహ్మాన్‌పై దాడి చేశాడు. దీంతో గాయపడిన రెహ్మాన్‌ను చిక్సిత నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.